క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం అందజేశారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. ఆడబిడ్డకు పెళ్లి చేసి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చెక్కులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్, సౌజన్య, గణేశ్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

మణుగూరురూరల్: ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ క్యాంటీన్ల నిర్వాహకులకు సూచించారు. సింగరేణి సీఅండ్‌ఎండి ఎన్ బలరాం ఆదేశాల మేరకు ఆయన శనివారం ఏరియాలోని పీకే ఓసీ–4 క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలు, పిట్ స్టోర్‌లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారం అందించకపోతే సహించేది లేదని స్పష్టం చేశారు. రుచి, శుచి పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఓసీ–4 మేనేజర్ రమణరెడ్డి, మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్) ఎస్.చంద్రకిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మొద్దు

అశ్వాపురం: మండలంలో దుకాణాల్లో చైనా మాంజా ఎవరూ అమ్మవద్దని సీఐ అశోక్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో దుకాణాల్లో మాంజా దారంపై శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎక్కడా మాంజా దారాలు లభించలేదు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. మాంజా దారం వల్ల మనుషులకు, పక్షులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దీనిని నిషేధించడం జరిగిందని ఎవరూ మాంజా దారం అమ్మవద్దన్నారు.

చట్టాలు సక్రమంగా అమలు చేయాలి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వాలు రెవెన్యూ చట్టాలను సక్రమంగా అమలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ చట్టాలు కొంతమంది అవినీతి అధికారులకు, భూస్వాములకు, ధనవంతులకు చుట్టాలుగా మారాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయంలో ధరణి పేరుతో.. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పేరుతో రెవెన్యూ చట్టాన్ని తీసుకోస్తోందని, పేర్లు మార్చితే రైతుల అవస్థలు మారవని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు చిరంజీవి, సోడెం ప్రసాద్, మడకం గోవింద్, ముళ్లగిరి గంగరాజు, కారం సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు

బూర్గంపాడు: సారపాకలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేవతి మాట్లాడుతూ.. గర్భిణులు తప్పనిసరిగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులలో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, దానిని అధిగమించేందుకు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, అమృత, ఆశావర్కర్ సంధ్య, ప్రమీల, ప్రశాంతి, స్వాతి పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

అశ్వాపురం: బూర్గంపాడు మండలం భద్రాచలం క్రాస్ రోడ్డు నుంచి వరంగల్ బార్డర్ దుగినేపల్లి వరకు ప్రధాన రహదారికి ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతుల పనులను శనివారం ప్రారంభించారు. భద్రాచలం క్రాస్ రోడ్డు నుండి మణుగూరు వరకు ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు ఎంతో కాలంగా కోరుతున్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మరమ్మతుల పనులు చేపట్టారు.

పోస్టులు భర్తీ చేయాలి

దుమ్ముగూడెం: చర్ల సెక్షన్ (సబ్ డివిజన్) పరిధిలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఖాళీగా ఉన్న విద్యుత్ సిబ్బందిని వెంటనే నియమించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సబ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో విద్యుత్ ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ పైస్థాయి అధికారులు, ప్రభుత్వం పూరించక పోవడం ఏజెన్సీ ఆదివాసీ ప్రజల పట్ల వివక్ష చూపడమేనన్నారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్, కోశాధికారి కొప్పుల నారాయణ, నాయకులు కొండా ప్రవీణ్ పాల్గొన్నారు.

దగా పడుతున్న శనగ రైతులు

- రైతుల పేరుతో దళారుల వ్యాపారం
- ధర నియంత్రణపై ఆధిపత్యం
- నష్టపోతున్న రైతులు



వేరుశనగ పంటను బస్తాల్లో నింపుతున్న కూలీలు

దమ్మపేట: ఆరుగాలం శ్రమించి వేరుశనగ పంటను సాగు చేస్తున్న రైతన్నలు (చిన్న, సన్న కారు, కౌలు రైతులు) దళారుల మాయలో పడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం సరైన దిగుబడి లేక నష్టాల ఊబిలో కూరుకుపోగా.. మరోపక్క దళారులు ధరను నియంత్రిస్తూ, రైతుల బతుకులతో ఆడుకుంటున్నారు.

మండలంలో సుమారుగా ఐదు వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు కానీ ప్రభుత్వ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వేరుశనగ పంటను కొనుగోలు చేసే సౌలభ్యం లేకపోవడంతో, దళారులు చెప్పిందే వేదంగా కొనుగోలు ధర నడుస్తుంది. మార్కెట్ కమిటీ కొనుగోలు చేయనప్పటికీ, కనీసం దళారులు, వ్యాపారుల మీద సంబంధిత అధికారుల నియంత్రణ కూడా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మోసపోతున్న రైతులు

వేరుశనగ పంటను సాగు చేయాలంటే మొదటిగా కావాల్సింది సరైన విత్తనాలు. ఈ విత్తనాలను ఆంధ్రాలోని వేరుశనగ మిల్లులు, వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్న దళారులు ఇక్కడికి తీసుకొచ్చి, ఇక్కడి రైతులకు పెట్టుబడిగా ఇస్తున్నారు. ఒక రైతుకు ఒక ఎకరానికి 100 కేజీల విత్తనాలతో పాటుగా పంటకు కావలసిన ఎరువులు, పురుగు మందులను కూడా దళారులే రైతులకు పెట్టుబడిగా ఇస్తున్నారు. ఈ పెట్టుబడిని ఆసరాగా చేసుకున్న దళారులు.. పంట చేతికి వచ్చిన తర్వాత, రైతుల నుంచి తాము చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారు. కానీ రైతుకు మద్దతు ధర ఉన్నచోట అమ్ముకోడానికి ఈ దళారులు ఒప్పుకోరు. అంతేగాక పెట్టుబడి రూపంలో ఇచ్చిన విత్తనాలు, ఎరువులకు అయిన మొత్తం సొమ్మును వడ్డీతో సహా రైతుల నుంచి కొనుగోలు సమయంలో దళారులు వసూలు చేస్తున్నారు.

తీవ్రస్థాయిలో నష్టం..

ఆరుగాలం కష్టపడి వేరుశనగను పండించిన రైతులు ఓ పక్క దళారుల వల్ల సరైన గిట్టుబాటు ధర లేక.. మరోపక్క సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. వేరుశనగ సాగుకు ఒక ఎకరానికి కౌలు, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుతో పాటుగా కలిపి సుమారుగా రూ.70,000ల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ పెట్టుబడి ఖర్చులను అధిగమించి రైతు, లాభంను పొందాలంటే ఒక ఎకరానికి సుమారుగా 15 క్వింటాలకు పైగా దిగుబడి రావాల్సి ఉంది. కానీ ప్రస్తుత సంవత్సరం దిగుబడి కొన్నిచోట్ల కేవలం 10 క్వింటాలకే పరిమితమైంది. వేరుశనగ పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,783లు ఉండగా.. దళారులు ఒక క్వింటాకు రూ.6,000 మాత్రమే చెల్లిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పంటకు అయిన పెట్టుబడి ఖర్చులు కూడా రాక పలువురు రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఆంధ్రాకు తరలింపు..

ఇక్కడి దళారులు ఆంధ్రా వ్యాపారులకు, స్థానిక రైతులకు మధ్య అడ్డుగోడలా మధ్యవర్తిత్వం చేస్తున్నారు. రైతుల వద్ద కొన్న పంటను దళారులు రైతుల పేరుతోనే ఆంధ్రా వ్యాపాలరులకు అందజేస్తున్నారు. ఇలా మధ్యవర్తిత్వం ద్వారా రూపాయి పెట్టుబడి లేకుండా లక్షల్లో ఆర్జిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



వేరుశనగ రైతులు దళారుల బారినపడి నష్టపోకుండా, ప్రభుత్వమే సరియైన మద్దతు ధరను నిర్ణయించి, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కొనుగోలు చేయాలి. దళారులతో కాకుండా లైసెన్స్ కలిగిన వ్యాపారులతో మద్దతు ధరకు వేరుశనగ పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. వేరుశనగ పంటకు కావాల్సిన విత్తనాలను మార్కెట్ కమిటీ ద్వారా అందజేయాలి. దళారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– చిన్నశెట్టి గోపి, యువరైతు, దమ్మపేట

మా దృష్టికి రాలేదు



దళారులు పంటను రైతుల పేరుతోనే ఆంధ్రకు తరలిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. దమ్మపేట మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ వద్ద కొంత మంది రైతులు ఒక శాతం సెస్‌ను చెల్లించి, ఆంధ్రకు పంటను తరలిస్తున్నారు. మార్కెట్ కమిటీ నిర్ణయించిన మద్దతు ధరకే, వ్యాపార లైసెన్సు కలిగిన వ్యాపారులు మాత్రమే రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాలి. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపైతగు చర్యలు తీసుకుంటాం.

– రాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి

రోడ్డు భద్రతపై అవగాహన



అశ్వారావుపేటరూరల్: అవగాహన కల్పించి ప్రమాణం చేయిస్తున్న ఎంవీఐ రాంబాబు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా భద్రాచలం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు రోడ్డు ప్రయాణ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదమంటే ఏమిటి? ప్రమాదాలు ఎలా జరుగుతాయి? ప్రమాదాల్లో రకాలు, కారణాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ రమ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని, ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు పాటించాలని స్థానిక మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కోరారు. శనివారం అశ్వారావుపేటలోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం వాహనదారులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకట సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గ్రామమైన బుగ్గలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మణుగూరు ఏరియా సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సింగరేణి వైద్యులు డాక్టర్ ఇన్నయ్య వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 73మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి స్టాఫ్ నర్స్ యు.భవాని, సిబ్బంది నాగమణి, రవి, బుగ్గ ఆశావర్కర్ మీనా, పాఠశాల ఉపాధ్యాయులు ఇ.రాంబాబు, ఎ.భద్రయ్య, సేవసమితి కో ఆర్డినేటర్ మారేశ్వరరావు, ఎండి.యూసఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని విజయనగరం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చలి తీవ్ర పెరుగుతున్నందున పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, సూపర్‌వైజర్ అనసూర్య, హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, శైలజ, వెంకటమ్మ రాధా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హత్య హేయమైన చర్య

ములకలపల్లి: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జర్నలిస్ట్ ముఖేష్ హత్య హేయమైన చర్య అని ములకలపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పోతుగంటి క్రాంతి అన్నారు. మండలపరిధిలోని తిమ్మంపేటలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాలను నిగ్గుతేల్చే యువ జర్నలిస్ట్ ముఖేష్ దారుణహత్యపై సమగ్ర విచారాణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత ముఖేష్ చిత్ర పటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. స్థానిక విలేకర్లు పువ్వాల శ్రీనివాసరావు, అయితా శేషగిరిరావు, బండారి శివప్రసాద్, అడపా సురేశ్, గద్దం ఉదయ్, యలమంచని సునీల్, బజ్జూరి ఈశ్వర్, బషీర్, ఇనుకుర్తి రామాచారి, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

వామనావతారంలో రాముడు



వామనావతారంలో పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా ఐదో రోజు శనివారం రామయ్యను వామనావతారంలో ఆలయ అర్చకులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు.. అనంతరం స్వామి వారిని వామనావతారంలో అలంకరించారు. ఈ అవతారాన్ని దర్శించడం వల్ల గురుగ్రహ బాధలు తొలగుతాయ అర్చకులు వివరించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా తాడేపల్లికి చెందిన బాలసుందరం ఆధ్వర్యంలో శ్రీరామచరిత్ర హరికథను ప్రదర్శించారు.అలాగే ప్రముఖ గాయని వాగ్దేవి వారి గానామృతముతో రామ సంకీర్తనలు అలపించారు. సాయంత్రం సంపూర్ణ కోలాటం బృందం తరుపున కోలాటం, వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. నేడు పరశురామావతారంలో దర్శనం ఇవ్వనున్న స్వామివారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లూరు రవికుమార్ శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతుకు పురస్కారం

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటకు చెందిన సేంద్రియ వ్యవసాయ రైతు, కొత్తా ఉమా మహేశ్వరరావును అభ్యుదయ రైతు పురస్కారంతో సన్మానించారు. శనివారం ఏపీలోని గుంటూరు జిల్లా పరిధిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్‌లు కలసి సంయుక్తంగా విశ్వవిద్యాలయంలో 250 మంది రైతులకు, అభ్యుదయ రైతు పురస్కారంతో పాటుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పురస్కారాలను ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, నర్సారావుపేట లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు చేతులమీదుగా రైతులకు అందజేశారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, గ్రామీణ బ్యాంకు, వైద్యశాల, పోస్ట్ ఆఫీస్‌లను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, హైమావతి పాల్గొన్నారు.

9న ఆల్ ఇండియా డిమాండ్ డే

దమ్మపేట: అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో జనవరి 9న నిర్వహించనున్న ఆల్ ఇండియా డిమాండ్ డేని జయప్రదం చేయాలని, రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ అనుబంధ రైతు సంఘం నాయకుల చేతుల మీదుగా డిమాండ్ డే గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల వేతనాలు, ఉపాధి హామీ కూలీల వేతనాలను పెంచి, ఆహార భద్రత, అర్హత కలిగిన వారికి ఇల్లు, ఉద్యోగం తదితర డిమాండ్లతో నిర్వహించనున్న డిమాండ్ డే కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి కిషోర్, గోకినపల్లి ప్రభాకర్, అమర్లపూడి రాము, నకిరగంటి నాగేశ్వరరావు, యర్రగొర్ల రామారావు, పండూరి వీరబాబు పాల్గొన్నారు.

కరకట్టలు నిర్మించాలి

బూర్గంపాడు: గోదావరి నదికి బూర్గంపాడు, అశ్వాపురం మండలాల వైపు కరకట్టలు నిర్మించాలని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన లేఖ రాశారు. భద్రాచలం వైపు కరకట్టల నిర్మాణంతో బూర్గంపాడు వైపు వరద ముంపు పెరిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో వేలాది ఎకరాల భూములు, ఇళ్ల నీటమునుగుతాయని పేర్కొన్నారు. అయితే పోలవరం ముంపులో ఈ రెండు మండలాలను చేర్చలేదని తెలిపారు. ముంపు తీవ్రతను తగ్గించేందుకు తప్పనిసరిగా కరకట్టలు నిర్మించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



కరెంట్ స్తంభాలు మార్చే పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామంలోని ఐటీడీఏ గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఎమ్మెల్యే పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు చేశారు. అలాగే సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మెనూ సక్రమంగా అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

మండల కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన డ్రైనేజీ, రహదారి విస్తరణ పనులు పరిశీలించి మరింత వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. అలాగే డ్రైయినేజీ, రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించే పనులను పరిశీలించి త్వరతరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ కరుణాకర్, ఎస్సై యయాతి రాజుతో శాంతిభద్రతలపై సమీక్షించారు.

శిశుగృహను సందర్శించిన న్యాయమూర్తి



భద్రాచలంలోని శిశుగృహ సందర్శనలో న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశు గృహను భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ శనివారం సందర్శించారు. శిశుగృహలో ఉన్న చిన్నారులను పరిశీలించి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శిశుగృహ అభివృద్ధికి లేదా చిన్నారుల నిమిత్తం ఏదైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని, ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తో చర్చిస్తానని తెలిపారు. శనివారం సాయంత్రం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సందర్శించి, శిశుగృహ నిర్వహణ, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, అవసరాలకు సంబంధించి మేనేజర్ చంటి బాబును అడిగి తెలుసుకున్నారు.

దేవాలయ ట్రస్ట్ బోర్డు నియామకం



సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డ్ కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శనివారం నియమించారు. దేవాలయ కమిటీ చైర్మన్‌గా గూడూరి సుదర్శన్‌రావుతో పాటు ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్లుగా చుక్కా సుధాకర్, చేగొండి శ్రీనివాస్, చుక్కా సతీష్ కుమార్, బచ్చు సాగర్, పరిసె రాఘవరావు, ముత్యాల వెంకటరమణలను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, కొండిశెట్టి కృష్ణమూర్తి, అరికెళ్ళ తిరుపతిరావు, పెద్దినేని శ్రీనివాస్, ఎండి.నవాబ్, చిట్టిబాబు, నర్రా రాము, వెంకటరెడ్డి, రామకృష్ణ, పుల్లారావు, విజయ్, నాగేంద్ర, రాజేష్, రామకృష్ణ, ప్రవీణ్, అరుణ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



పాగళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన దాతలు

ములకలపల్లి: మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు చిరాగ్ ఫౌండేషన్ (యూఎస్‌ఏ) సహకారంలో స్టడీ మెటీరియల్‌ను పంపణీ చేశారు. ములకలపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఖమ్మం కమిషనరేట్ ఎస్సై పుష్పాల రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, మండలకేంద్రంతోపాటు, పాగళ్లపల్లి, జగన్నాథపురం, పూసుగూడెం, కేజీబీవీ పాఠశాలల్లోని 200 మంది విద్యార్థులకు స్టడీ గైడ్స్ అందించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడారు. అమెరికాలో స్థిరపడిన చిరాగ్ ఫౌండేషన్‌కు చెందిన కోపూరు రూప ఈశ్వర్, యడ్లపాటి ఉష గిరి, మోతె దివ్య రామ్, కోవెలమూడి దీప్తి వెంకట్, పకీరు స్వప్న సహకారంతో గత మూడేళ్లుగా స్టడీ మెటీరియల్స్ సప్లై చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్‌రావు, పుష్పాల సాయి, పాలకుర్తి రత్నభూషణం, కొమ్మరాజు శ్రీను. పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: జీసీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ పట్టణ నాయకులు బండారు శరత్ బాబు హెచ్చరించారు. నాలుగో రోజు శనివారం సమ్మె శిబిరాన్ని ప్రముఖ వ్యాపారవేత్త లయన్ పల్లంటి దేశప్ప పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. జీసీసీ కార్మికుల ఎగుమతులు, దిగుమతుల ఒప్పందాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రేషన్ షాపులకు ధాన్యం చేరవేసే కార్మికులకు ఒప్పందం ప్రకారం రేట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం స్వామి, నకిరేకంటి నాగరాజు, జీసీసీ కార్మికులు ప్రసాద్, శేషు, లోకేష్, రామారావు, ముత్తయ్య, పాండు, మోహన్, రవి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

దమ్మపేట: న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలి అని కోరుతూ.. గిరిజన సహకార సంస్థ హమాలీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు శనివారం కాసేపు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఒప్పందం మేరకు చెల్లించాల్సిన ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతలతో పాటుగా పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అమర్లపూడి రాము, వీరబాబు, నాగమణి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు గురికావొద్దు

ములకలపల్లి: పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికావొద్దని అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'హెల్ప్'కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ ధ్యాన్యం, యోగా చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కల్పన, లెక్చరర్లు. విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం



సాయనపల్లి రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

గుండాల: ఏజెన్సీ ప్రాంతమైన గుండాల మండల అభివృద్ధి లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం ఆయన గుండాల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుండాల మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉండడానికి పాలకవర్గాల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఇక్కడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, ప్రభుత్వ, పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, కోఆపరేటివ్ బ్యాంకులో అడంగల్ పహాణితో ఇచ్చిన రుణాలు రీషెడ్యూల్ చేయాలని అన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కిన్నెరసాని వాగుపై చిన్న వెంకటాపురం వద్ద ప్రాజెక్టు నిర్మించడం వల్ల మండలంలో ఉన్న సాగు భూములన్నింటికీ రెండు పంటలు పండేంత సాగునీరు అందుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు. గుండాల నుంచి రంగాపురం రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో మండల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, తోలెం గోపి, దుగ్గి రామ్మూర్తి, బొమ్మల కనకరాజు, ఎరెం రమేష్, గడ్డం కృష్ణ, ముసలి రామకృష్ణ, కల్తీ శేఖర్, సుశీల, పార్వతి, కల్తీ సమ్మయ్య, సత్యం పాల్గొన్నారు.